

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల (కల్చరల్), జూలై 7: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా సోమవారం అర్జీలు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటలకే అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఇవి తాగే నీళ్లేనా..?

- జిల్లాలో వరుసగా అతిసార కేసులు
- మొద్దు నిద్ర వీడని అధికారులు
- నీటి పరీక్షల విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ నిర్లక్ష్యం
- పట్టించుకోకపోతే ప్రజారోగ్యానికి ముప్పు


ప్యాపిలి మండలం కలచట్ల గ్రామంలోని తాగునీటి ట్యాంకు -

నంద్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా గ్రామాల్లో తాగు నీరు విషతుల్యమవుతోంది. ప్రజలకు రక్షిత నీరు సరఫరా చేసే పైపుల లీకేజీ, ట్యాంకులను శుభ్రం చేయకపోవడం వల్ల అనేక గ్రామాల్లో అతిసార ప్రబలుతోంది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రక్షిత నీటి సరఫరా వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి నీరు తాగి ఎట్లా బతకాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో అతిసార కేసులు నమోదవటం ఇదే మొదటిసారి కాదు. ప్రతి ఏటా ఏప్రిల్ నెల మొదలు కాగానే అతిసార ప్రబలుతోంది. రెండేళ్ల కిందట ఆళ్లగడ్డ మండలం జి. జంబులదిన్నె గ్రామంలో అతిసార ప్రబలి ముగ్గురు చనిపోయారు. 15 మంది ఆస్పత్రి పాలయ్యారు. జూలైలో బనగానపల్లె మండలం కటికవానికుంట గ్రామంలో అతిసారతో ఓ మహిళ మృతి చెందింది, మరో ఐదుగురు ఆస్పత్రి పాలయ్యారు. అదే ఏడాది ఆగస్టులో పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో అతిసారతో 32 మంది ఆస్పత్రిలో చేరారు. ఇక కిందటేడాది నంద్యాల పట్టణంలో అతిసార ప్రబలి ఆరుగురు ఆస్పత్రి పాలయ్యారు. ఈ సంఘటనలన్నీ తాగునీరు కాలుష్యాన్ని తెలియజేస్తున్నాయి. ఇవేగాకుండా జిల్లాలోని చెంచు గూడేల్లో అతిసార కేసులు నమోదైన ఘటనలు కూడా గతంలో ఉన్నాయి. అతిసార ప్రబలినప్పుడు అప్పటికప్పుడు హడావుడి చేయడం తప్పా అధికారులు సరైన నివారణ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి నమూనా పరీక్షలు, ట్యాంకులను శుభ్రం చేయడం, గ్రామ పంచాయతీల పరిధిలో ఆర్‌సీ(రెసిడ్యూయల్ క్లోరిన్) టెస్టులు నామమాత్రంగా జరుగుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. గత వైసీపీ పాలనలో ప్రజా సమస్యల పట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధిగా పని చేసిన దాఖలాలు లేవు. అయితే ప్రభుత్వం మారాక కూడా అధికారులు తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాములపాడు మండలం మిట్టకందాలలో రెండు కేసులు నమోదు కాగానే పూర్తిస్థాయిలో సమస్యను గుర్తించి నీటి పరిశుభ్రత మీద కేంద్రీకరించి ఉంటే పరిస్థితి ఇంతగా దిగజారి ఉండేది కాదు.

మొద్దు నిద్ర వీడని అధికారులు..

గత ప్రభుత్వం పంచాయతీలకు రావాల్సిన నిధులను పూర్తిగా పక్కదారి పట్టించడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకపోయాయి. ముఖ్యంగా పారిశుధ్యం సరిగా ఉండేది కాదు. డ్రైనేజీల సంగతి సరేసరి. దీంతో ఏళ్లుగా కలుషిత నీరు భూమిలోనికి ఇంకిపోయింది. దీనికి తోడు పలు గ్రామాల్లో మంచినీటి కాలువల పక్కనే చెత్త పేరుకుపోయింది. ట్యాంకుల పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. తాగునీటి కుళాయిల వద్ద శుభ్రంగా లేకపోవడంతో తాగునీరు కలుషితమవుతోందన్న విమర్శలు వినిపించేవి. ప్రస్తుతం కొత్తగా ఎన్నికైన అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లోని ఇలాంటి సమస్యలపైన దృష్టి సారిస్తున్నారు. అయితే గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా పడకేసిన అన్ని శాఖలు గాడిలో పడటానికి కాస్త సమయం పట్టేలా ఉంది. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు ఇంకా మొద్దు నిద్ర వీడటం లేదు. కీలకమయిన తాగునీటి విషయంలో నిబంధనల ప్రకారం యంత్రాంగం వ్యవహరించడం లేదన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. అధికారులు తీరు వల్ల అతిసారతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. అధికారులు మాత్రం తాము బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నామని, ఎప్పటికప్పుడు టెస్టులు చేయాలని, ట్యాంకులు శుభ్రపరచాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచిస్తున్నామని చెబుతున్నారు. గ్రామ స్థాయి సిబ్బంది తాము విధుల్లో ఏ విధమైన అశ్రద్ధ వహించడం లేదని చెప్పుకొస్తున్నారు. ఇదే నిజమైతే ప్రజల ప్రాణాలను హరించేలా అతిసార ఎందుకు ప్రబలుతోంది? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, సిబ్బంది కళ్లు తెరిస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ.

గత నెల 20వ తేదీన జూపాడుబంగ్లా మండలం చాబోలు గ్రామంలో అతిసార ప్రబలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పాములపాడు మండలం మిట్టకందాల గ్రామంలో గత నెల 18న రెండు అతిసార కేసులు నమోదయ్యాయి. 28న 2, 29న 4, 30న 7, మళ్లీ ఈ నెల 1న మరో 6 కేసులు, 2న 12, కేసులు, 3న 6 కేసులు నమోదయ్యాయి. ఒక చిన్న గ్రామంలో వరుసగా ఇన్ని అతిసార కేసులు నమోదువుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఒకటి రెండు కేసులు నమోదవగానే అధికారులు సరైన చర్యలు తీసుకుంటే పరిస్థితి ఇక్కడి దాకా వచ్చేది కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ట్యాంకు

ప్రతిసారీ అదే తీరు..

జిల్లాలో వివిధ రకాల పథకాల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా సీపీడబ్ల్యూఎస్ పథకం కింద బోర్లు, మోటర్లు 789, జీఎల్ఎస్ఆర్ (గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్) 688, డైరెక్ట్ పంపింగ్‌లు 600, చేతి పంపులు - 5054 ఉన్నాయి. వీటి ద్వారా ఆయా గ్రామాలకు తాగునీరు అందుతోంది. ఇలా అందే నీరు స్వచ్ఛమైనదేనా? అనే దానిపై మాత్రం ఎవరికీ స్పష్టత లేదు. అతిసార వంటి వ్యాధులు ఏదో ఒకరోజు నీరు కలుషితం అవడం వల్ల వచ్చేది కాదని, నెలలు లేదా సంవత్సరాల తరబడి నీరు లీకేజీ అవుతూ కలుషితమవుతున్నందు వల్లే ఇలా జరుగుతుందన్నది వైద్య నిపుణుల అభిప్రాయం. రెండేళ్లుగా నమోదైన అతిసార కేసులన్నీ తాగునీటి పైపులు లీకేజీ వల్ల కలుషితం కావడం వల్లేనని క్షేత్రస్థాయిలో వెల్లడవుతున్న వాస్తవాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం పాములపాడు మండలం చాబోలు గ్రామంలోని ప్రబలిన అతిసారకు కలుషిత నీరే కారణమని, ఈ గ్రామంలో మూడు చోట్ల నీటి లీకేజీని గుర్తించామని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మంచినీటి పథకాల నిర్వహణ ఎలా ఉంది? ప్రజల ఆరోగ్యం పట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏ మేరకు శ్రద్ధ వహించారు? అనే విషయం తేటతెల్లమవుతోంది. ఇప్పటి నుంచి అయినా అధికారులు అతిసార ప్రబలినప్పుడు హడావుడి చేయకుండా ఎప్పటికపుడు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి పైపుల లీకేజీలు గుర్తించడం, నీరు కలుషితం కాకుండా చూడటం వంటి సరైన చర్యలు తీసుకుంటే అతిసార వంటివి ప్రబలకుండా ఉంటాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.

గత ప్రభుత్వ తీరుతో..

జిల్లా విడిపోయిన తర్వాత నంద్యాలలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీ పాలన మాత్రం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సాగుతోంది. గ్రామాలలో సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణకు నిధులు జడ్పీనే కేటాయిస్తుంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల్లో సింహభాగం గ్రామాలలో మౌలిక వసతులపైనే పెట్టాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు అందించాల్సిన నిధులు పూర్తిగా పక్కదారి పట్టించింది. దీనికి తోడు ఆర్‌డబ్ల్యూఎస్ పనులను విడిగా చేపట్టి, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిధులు ఎలా కేటాయించాలనే దానిపైన స్పష్టత ఇవ్వకపోవడంతో చాలా పనులు సరిగ్గా జరగలేదు. ఇక ఆర్‌డబ్ల్యూఎస్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది అంతా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేవారే. వీరికి గత వైసీపీ ప్రభుత్వం నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధించింది. దీంతో వారు విధులు సక్రమంగా నిర్వహించలేదన్న విమర్శలూ ఉన్నాయి. దీంతో గ్రామ స్థాయిలో స్వచ్ఛమైన నీరు అందకపోవడంతో అతిసార ప్రబలినట్లు తెలుస్తోంది.

పరీక్షలు చేస్తున్నారా..?

జిల్లాలో నంద్యాల, డోన్, ఆత్మకూరు, బనగానపల్లెలో మంచినీటి పరీక్ష కేంద్రాలున్నాయి. వీటిలో నెలకు 180 కెమికల్, 120 బ్యాక్టీరియోలాజికల్ పరీక్షలు చేయాలి. అలాగే వర్షాకాలానికి ముందు, తర్వాత అంటూ సంవత్సరంలో రెండు సార్లు పరీక్షలు చేయాలి. ఈ పరీక్షల్లో మొత్తం 13 అంతర్గత పరీక్షలు ఉంటాయి. దీనికి తోడు ప్రతిరోజూ ఆర్‌సీ(రెసిడ్యూయల్ క్లోరిన్) పరీక్షలు చేయాలి. స్థానికంగానే ఈ నీటి పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం ఫీల్డ్ టెస్టింగ్ కిట్లను పంచాయతీలకు అందజేసింది. సచివాలయాల్లో ఉండే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హెల్త్ ప్రొవైడర్లకు ప్రభుత్వం ఈ బాధ్యత అప్పజెప్పింది. వీరు విధిగా పరీక్షల తాలూకా ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ఇవేవీ క్షేత్రస్థాయిలో అమలవుతున్న దాఖలాలు లేవు. రిజిస్టర్‌లో ప్రతిరోజూ పరీక్షలు చేస్తున్నట్లు చూపుతున్నా, వాస్తవంగా పరీక్షలు సరిగా చేయడం లేదని తెలుస్తోంది. ఇక ట్యాంకులను శుభ్రపరచడం అన్నది గ్రామస్థాయి సిబ్బంది వీలు, తీరికను బట్టి ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. కొన్ని ట్యాంకులకు మెట్లు లేవని, మరికొన్ని చోట్ల విరిగిపోయి ఉండటం తమ దృష్టికి వచ్చిందని, మెట్లను వెంటనే ఏర్పాటు చేసుకుని ట్యాంకులను శుభ్రపరచాలని చెబుతున్నామంటూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే ఒప్పుకుంటున్నారు. దీన్ని బట్టే క్షేత్ర స్థాయిలో మంచినీటి సరఫరా స్వచ్ఛత ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమవుతోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే జిల్లాలో మరిన్ని అతిసార కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

జిల్లా అభివృద్ధికి కృషి

- సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తాం
- బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రాజకుమారి


కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జి.రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 7: ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నంద్యాల జిల్లా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. ఆదివారం ఉదయం 11:30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న నూతన కలెక్టర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనాలు, సర్వమత ప్రార్థనల అనంతరం ఉదయం 11:35 గంటలకు జి.రాజకుమారి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. నంద్యాల లాంటి మంచి జిల్లాకు మొదటిసారిగా కలెక్టర్ హోదాలో పనిచేసేందుకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్‌రూమ్, అన్ని సెక్షన్ల విభాగాలను కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, ఆర్డీఓలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన సమూహంలోకి చిరుత

భయంతో పరుగులు తీసిన స్థానికులు

మహానంది, జూలై 7: కొంత కాలంగా మహానంది పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్న చిరుతపులి ఆదివారం సాయంత్రం చీకటి పడకముందే జన సంచారంలోకి వచ్చేసింది. నల్లమల అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన చిరుత ముందుగా క్షేత్రానికి సమీపంలోని పెద్ద నంది విగ్రహం వద్ద భక్తులకు కనిపించింది. దీంతో నందిని తిలకించేందుకు వచ్చిన భక్తులు, అటుగా వెళ్తున్న స్థానికులు చిరుతపులిని చూసి బెంబేలెత్తిపోయారు. వెంటనే చిరుత అక్కడి నుండి అటవీ పర్యావరణ విద్యా కేంద్రం మీదుగా దేవస్థానం ఉద్యోగుల కాలనీ సమీప ప్రాంతానికి వచ్చింది. దీంతో బయట ఉన్న కాలనీ వాసులు చూసి భయంతో ఇళ్లలోకి పరుగులు తీశారు. అటవీ శాఖ అధికారులు చిరుతపులిని బంధించి ప్రాణాపాయం నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు చిరుతపులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు.

క్రెడిట్ కార్డు మోసాలపై అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ

నంద్యాల క్రైం, జూలై 7 : క్రెడిట్ కార్డు మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు తాము బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని మీకు ఇన్సూరెన్స్ యాడ్ చేశారని, ప్రతినెలా మీ అకౌంటు నుంచి ఈఎంఐ కట్ అవుతోందని చెబుతారని అన్నారు. మీరు ఇన్సూరెన్స్ చేయకపోతే దాన్ని డీ ఆక్టివేట్ చేయాలని చెబుతారని పేర్కొన్నారు. అనంతరం ఒక ఏపీకే ఫైల్‌ను పంపి దాంట్లో మీ క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేయాలని సూచిస్తారని ఎస్పీ తెలిపారు. అలాగే మీ క్రెడిట్ కార్డు వివరాలు కూడా అడుగుతారని పేర్కొన్నారు. వారు చెప్పినట్లు మీరు ఏపీకే ఫైల్ ఓపెన్‌చేసి మీ క్రెడిట్‌కార్డు వివరాలు అనగా మీ కార్డుపై ఉన్న 16 అంకెలను, సీవీవీ, ఎక్స్‌పైరీ డేట్ వివరాలు సైబర్ నేరగాళ్లకి తెలపగానే వాటిని వినియోగించుకొని వారికి అవసరమైన వస్తువులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తారని వివరించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ క్రెడిట్‌కార్డు వివరాలను ఎవ రికీ చెప్పవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి ప్రజలను అప్రమత్తం చేశారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ: నంద్యాల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజకుమారి గణియాను ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం వారు నంద్యాల ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ రాజకుమారి గణియాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు.


కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

బీజేపీ వైపు.. బుగ్గన చూపు?





- పార్టీ మారేందుకు ప్రయత్నాలు
- కాషాయం జెండా కప్పుకునేందుకు పావులు
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ద్వారా ప్రయత్నాలు?
- ఢిల్లీలోనే మకాం.. మాజీ సీఎం జగన్‌కు మరో దెబ్బ

డోన్, జూలై 7: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో ఘోర పరాజయం చవి చూసిన వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు మరో దెబ్బ పడనుంది. డోన్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీని వీడి, బీజేపీలో చేరేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ద్వారా పావులు కదుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. తన వ్యాపారాలను కాపాడుకునేందుకే బుగ్గన పార్టీ మారుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ పరిణామాలు వైసీపీలో కలకలం రేపుతున్నాయి. మాజీ సీఎం జగన్‌కు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అత్యంత సన్నిహితునిగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో మొదటిసారి డోన్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న జగన్ పీఏసీ చైర్మన్ పదవిని బుగ్గనకు కట్టబెట్టారు. దీంతో అప్పట్లో అసెంబ్లీలో తనదైన ప్రసంగాలతో బుగ్గన జగన్‌కు మరింత దగ్గరయ్యారు. 2019 ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా బుగ్గన రెండోసారి గెలుపొందారు. వైసీపీ అధికారంలోకి రావడంతో జగన్ కేబినెట్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పని చేశారు. ఐదేళ్లు ఆర్థిక మంత్రిగా వైసీపీ ప్రభుత్వంలో బుగ్గన తిరుగులేని హవా కొనసాగించారు. పార్టీ ఓడిపోయాక ఆయన బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు.

కేంద్ర పెద్దలతో సంబంధాలు..

రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పని చేసిన సమయంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కేంద్రంలోని పెద్దలతో సంబంధాలు పెంచుకున్నట్లు చర్చ నడుస్తోంది. ముఖ్యంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వద్దకు నిత్యం ఫైళ్లను పట్టుకుని బుగ్గన వెళ్తూ కనిపించేవారు. రాష్ట్రానికి అప్పులు తీసుకురావడంలోనూ, కేంద్ర నిధులు రాబట్టడంలోనూ బుగ్గన ఎక్కువసార్లు ఢిల్లీ పర్యటనలు చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సంబంధాలు పెంచుకున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఇటు గత వైసీపీ ప్రభుత్వంలో కీలకమంత్రిగా ఉండటం, అటూ కేంద్ర పెద్దలతోనూ సంబంధాలు పెంచుకున్న బుగ్గన తన వ్యాపారాలను విస్తరించుకున్నారు. రాష్ట్రంతో పాటు తమిళనాడు, బెంగళూరు, తెలంగాణలో మైనింగ్ వ్యాపారాలను పెంచుకోవడంతోపాటు సిమెంటు ఫ్యాక్టరీలను కొనుగోలు చేశారు. ఇలా బుగ్గన తన పలుకుబడితో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తూ వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

బీజేపీలో చేరేందుకు బుగ్గన యత్నాలు

రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయిన తర్వాత మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బీజేపీలోకి వెళ్లేందుకు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వారం రోజులుగా బుగ్గన ఢిల్లీలోనే మకాం వేసినట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో బీజేపీలో చేరే విషయంపై ఇప్పటికే బుగ్గన సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. బీజేపీలోకి వస్తానని ఇప్పటికే కేంద్ర పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. బీజేపీలో చేరి తన వ్యాపారాలను కాపాడుకునేందుకు బుగ్గన తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పరిణామాలు వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుగ్గన (ఫైల్)

రాజకీయాల్లోకి వద్దనుకున్నా

సినీ నటుడు సుమన్



విలేకరులతో మాట్లాడుతున్న సుమన్

ఆత్మకూరు, జూలై 7: గతంలో తాను రాజకీయాల్లో చురుగ్గా కొనసాగినప్పటికీ ఆ తర్వాత పలు కారణాలతో దూరంగా ఉన్నానని సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సుమన్ కాసేపు విలేకరులతో మాట్లాడారు. తనకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఉన్నప్పటికీ తన మదిలో మెదలాడే ప్రశ్నలకు సమాధానాలు దొరక్క అలాగే ఉండిపోయానన్నారు. అందులో ప్రధానంగా జైల్లో ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కానీ జైల్లో ఉన్న ఖైదీలకు ఓటు హక్కు ఎందుకు లేదో అర్థం కావట్లేదని అన్నారు. అలాగే ఎన్నికల్లో ఒక అభ్యర్థి రెండు చోట్ల పోటీ చేయాల్సిన అవసరం ఎందుకని..? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదన్నారు. ఇలాంటి వాటిపై పాలకుల ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపోతే గత వైసీపీ పాలనలో పలు పథకాలు ప్రజలకు మేలు చేసేలా ఉన్నప్పటికీ కొన్ని విధానాలు నచ్చకే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని సుమన్ అభిప్రాయపడ్డారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఏసుక్రీస్తు జీవిత చరిత్రతో కూడిన జీసస్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సుమన్ వెల్లడించారు.

నేటి నుంచి ఉచిత ఇసుక పాలసీ

వెబ్ సైట్‌లో నిల్వల వివరాలు

కర్నూలు(అర్బన్), జూలై 7: ఉచిత ఇసుక పాలసీ ఈనెల 8 నుంచి అమలులోకి రానుందని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వివరాలను వెబ్ సైట్‌లో చూసుకోవాలని, ఏ డంప్‌లో ఎంత నిల్వ ఉన్నదీ చూసుకునేందుకు స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నామని తెలిపారు.

లోక కళ్యాణార్థం జల కలశాలతో పాదయాత్ర



కలశాలతో యాగంటికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు

బనగానపల్లె, జూలై 7: లోక కళ్యాణార్థం బనగానపల్లె పట్టణంలోని రవ్వల కొండలో వెలసిన హట్టిమునిస్వామి ఆశ్రమం నుంచి ఆదివారం జల కలశాలతో యాగంటి క్షేత్రానికి విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్ర బనగానపల్లె నుంచి యాగంటిపల్లె, సాధుకొట్టం, మీరాపురం మెట్ట, పాతపాడు మీదుగా 11 కిలోమీటర్లు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అహోబిలంలో టీవీఎస్ కంపెనీ చైర్మన్



అహోబిలం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్‌తో కలిసి హోమంలో పాల్గొన్న టీవీఎస్ కంపెనీ చైర్మన్ వేణు శ్రీనివాసన్

ఆళ్లగడ్డ, జూలై 7: టీవీఎస్ కంపెనీ చైర్మన్ వేణుశ్రీనివాసన్ ఆదివారం అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గడిపారు. అహోబిలంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ, అష్టదిగ్బంధన, మహాసంప్రోక్షణ కార్యక్రమాల్లో జరిగిన హోమాల్లో పీఠాధిపతి రంగనాధయతీంద్ర మహాదేశికన్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా పీఠాధిపతిని మర్యాద పూర్వకంగా కలిసి అహోబిలం అభివృద్ధిపై చర్చించుకున్నారు. అహోబిలానికి ఉదయం మద్రాసు నుంచి హెలికాప్టర్ చేరుకున్న వేణు శ్రీనివాసన్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీనరసింహస్వామికి జరిగిన హోమాల్లో పాల్గొన్న ఆయన తిరిగి మధ్యాహ్నం మద్రాసుకు బయలుదేరివెళ్లారు. ఈయన రాకను పురస్కరించుకొని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో కొత్త కలెక్టర్



పూజలు నిర్వహించడానికి వస్తున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది, జూలై 7: మహానంది క్షేత్రంలో నంద్యాల కలెక్టర్ రాజకుమారి దంపతులు ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహానందీశ్వరుడి దర్శనం కోసం రాగా వీరికి ఆలయం ముఖద్వారం వద్ద వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో సాయంత్రం వేళల్లో నిర్వహించే మహామంగళ హారతుల సేవలో పాల్గొన్నారు. ప్రధాన గర్భాలయాల్లో స్వామి, అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. కల్యాణ మంటపంలో కలెక్టర్ దంపతులను వేదపండితులు రవిశంకర్ అవధాని, హనుమంత్‌శర్మలు ఆశీర్వదించారు. ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు శాల్వతో సన్మానించి, పట్టు వస్త్రాలు అందజేశారు. మండల డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ధీరజ్‌రెడ్డి (ఫైల్)

ప్యాపిలి, జూలై 7: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధీరజ్‌రెడ్డి(22) దుర్మరణం చెందాడు. మండలంలోని ఎర్రగుంట్లపల్లికి చెందిన వైసీపీ నాయకుడు పోలిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుమారుడు ధీరజ్‌రెడ్డి, అతని స్నేహితుడు రమేష్ తెల్లవారుజామున వెంగళాంపల్లి గ్రామానికి బైకుపై వెళ్లి తిరిగి ఎర్రగుంట్లపల్లికి బయలుదేరారు. బైపాస్ రోడ్డులో పెద్దమ్మ డాబా సమీపంలో ముందు వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వీరి బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధీరజ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అయనను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, గజేంద్రరెడ్డి, చిన్నసుంకయ్య, రాజామురళి, గడ్డం భువనేశ్వరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఆగస్టు 18 నుంచి రాఘవేంద్రుని ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, జూలై 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్త రాత్రోత్సవాలు ఆగస్టు 18 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆగస్టు 18న ధ్వజారోహణ, ధాన్యపూజ, 19న శాఖోత్సవం, రజత మండపోత్సవం, రుగ్వేద, యజుర్వేద ఉపాకర్మలు ఉంటాయని తెలిపారు. 20న ఉత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన, అత్యంత ప్రాముఖ్యమైన 21న మధ్యారాదన, 22న మహారథోత్సవం (జాతర) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన, 24న సర్వసేవ సమర్పణ, అనంతరం పీఠాధిపతి మహామంగళహారతులతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఏడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతాచార్‌లు ఏర్పాట్లపై సమీక్షలు చేస్తున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని మఠం అధికారులను ఆదేశించారు. వసతి తాగునీరు, పరిశుభ్రత, ఉచిత అన్నదానం, క్యూలైన్లు, పరిమళ ప్రసాదం, స్నానపు ఘట్టాలు, వాహనాల పార్కింగ్, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉత్సవాల్లో భాగంగా యోగీంద్ర కళామండపంలో వివిధ రంగాల్లోని ప్రముఖులకు శ్రీరాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డులను పీఠాధిపతి ప్రదానం చేస్తారు. సంగీత దానవాణి సాహిత్యం, శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, వీణావాయిద్యం, వోకల్ సంగీతం తదితర పౌరాణిక కళారూపాలు ప్రదర్శిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంజనీర్ సెక్షన్ ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్‌లు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



రాఘవేంద్ర స్వామి మఠం మహా ముఖద్వారం

ఊరంతా కదిలొచ్చె..!


- పీర్ల దేవుడు పొలాల్లో ప్రత్యక్షమవుతాడంటూ మభ్యపెట్టిన బాలుడు
- బాలుడి వెంట భారీగా తరలిన ప్రజలు
- ఆలూరు మండలం కురువల్లిలో వింత ఘటన



బాలుడి వెంట తరలి వచ్చిన జనం



దేవుడిన చూపిస్తా అంటూ చెప్పిన బాలుడు



సంచిలో నుంచి తీసిన పీరును పోలిన కత్తి

ఆలూరు, జూలై 7: మెగాస్టార్ చిరంజీవి నటించిన స్నేహంకోసం సినిమాలో ఓ నటుడు కొండను ఎత్తేస్తాను అంటే ఊర్లోని జనం అంతా పోలోమని వెళ్తారు. సరిగ్గా అలాంటి సంఘటనే ఒకటి ఆలూరు మండలంలో చోటు చేసుకుంది. 'నాకు దేవుడు కనిపిస్తున్నాడు. పీర్లస్వామి మన ఊరిలోనే ఉన్నాడు. మన పొలాల్లోనే ఉన్నాడు... రండి చూపిస్తా..' అంటూ 12 ఏళ్ల బాలుడు చెప్పిన మాటలను ప్రజలు గుడ్డిగా నమ్మారు. వేలాదిగా ప్రజలు ఆ బాలుడి వెంట వెళ్లిన సంఘటన ఆదివారం సాయంత్రం ఆలూరు మండలం కురువల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆదివారం ఉదయం నుంచి పూనకం వచ్చినట్లు నటించాడు. పూనకంలో భాగంగా చెప్పిన మాటలను ప్రజలు నమ్మేశారు. దీంతో సాయంత్రం తనతోపాటు రండి 'పీర్ల దేవుడిని చూపిస్తా..' అంటూ పిలుపునిచ్చాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కురువల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ వేలాదిగా తరలివచ్చారు. కొందరైతే సుదూర ప్రాంతాల నుంచి కార్లలో రావడం గమనార్హం. బాలుడి మాటలు విన్న జనం పొలాల వెంబడి బాలుడి వెంట పోలోమని పరుగులు తీశారు. ఓ పొలం వద్ద ఆగిన బాలుడు సమీపంలోని చెట్టు వద్దకు వెళ్లి తన సంచిలో ఉన్న పీర్లను పోలిన ఓ కత్తిని తీసి 'ఇదిగో దేవుడు...' అంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఒక్కసారిగా ఖంగుతిన్న ప్రజలు జరిగిన తప్పుడు ప్రచారం, మోసాన్ని గుర్తించి బాలుడిని మందలించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మా స్థలాన్ని ఆక్రమించాడు

వైసీపీ నాయకుడిపై దళిత వృద్ధ దంపతుల నిరసన

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో 2011లో ఇచ్చిన సెంటు స్థలాన్ని వైసీపీ నాయకుడు, కూరగాయల మార్కెట్‌కు చెందిన కలాం అనే వ్యక్తి ఆక్రమించాడని బాధితులు ఆదివారం ధర్నాకు దిగారు. నంద్యాల వీసీ నగర్‌కు చెందిన సుబ్బరాయుడు, వెంకట సుబ్బమ్మ దంపతులకు వరద ముంపు బాధితుల కింద 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం నంద్యాల మండలం సుగాలితండా సమీపంలో సెంటు స్థలాన్ని మంజూరు చేసింది. ఆరునెలల క్రితం వైసీపీకి చెందిన కూరగాయల మార్కెట్ కలాం తమ సెంటు స్థలాన్ని ఆక్రమించాడని వారు ఆరోపించారు. న్యాయం కోసం అప్పటి వైసీపీ ప్రభుత్వంలో స్పందనలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. వారం రోజుల క్రితం నంద్యాల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళగా పరిశీలించిన రెవెన్యూ అధికారులు బాధితుల పేరు మీదనే ఆ స్థలం చూపించడంతో క్లియరెన్స్ ఇచ్చారు. అయినా మూడు రోజుల క్రితం కలాం అనే వ్యక్తి తమ స్థలంలో వేసుకున్న రేకుల షెడ్డు, నాపరాతి బండలను కూల్చి వేయడం జరిగిందని ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారాం నంద్యాల బొమ్మలసత్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వృద్ధ దంపతులు న్యాయ దీక్ష చేపట్టారు. అనంతరం రాత్రి తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ ఆధ్వర్యంలో స్టేషన్ బయట బైఠాయించి తమకు న్యాయం జరగాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాలూకా అర్బన్ సీఐ దస్తగిరికి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు చేపడతామని బాధితులకు నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

వడ్డె ఓబన్న సేవా సమితి ఏర్పాటు


నూతనంగా ఎన్నికైన ఆత్మకూరు అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు, జూలై 7: అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి ఆత్మకూరు పట్టణ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం వ్యవస్థాపకుడు బాల నరసింహులు సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో పట్టణ అధ్యక్షుడిగా చంద్రగిరి మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా చల్లా సుబ్బయ్య, గుంజి వెంకటరమణ, గుంజి రాజు, చంద్రగిరి దుర్గారాజు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా సంపంగి వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ కార్యదర్శిగా వల్లెపు మల్లికార్జున, సోషల్ మీడియా కార్యదర్శులుగా సంపంగి వెంకటేశ్వర్లు, శివ, కార్యదర్శిగా శివ, శ్రీహరిలను నియమించారు. ఈ బాల నరసింహులు మాట్లాడుతూ వడ్డెర్లంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి చేర్చేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీవీఎస్ రాజు, సంపంగి శివకృష్ణ, కుంచెపు చిన్న, సుబ్బయ్య, రోళ్లగొటి మల్లికార్జున, కేతన సురేష్ తదితరులు ఉన్నారు.

భారతీయ కొత్త చట్టాలను రద్దు చేయాలి

ఆత్మకూరు, జూలై 7: కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా తీసుకొచ్చిన భారతీయ కొత్త చట్టాలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు ప్రజలకు హానికరంగా ఉన్నాయని వివరించారు. రోడ్డు ప్రమాదాల కేసులను గతంలో ఉన్న రెండేళ్ల జైలు శిక్షను ఐదేళ్లకు పెంచడం సరికాదని అన్నారు. జూలై 1 నుంచి అమలైన చట్టాలు కొత్త సీసాలో వేసిన పాత నీరు లాంటిదేనన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులకు ప్రతికూలంగా, పోలీసులకు విస్తృత అధికారులు ఇచ్చేలా చట్టాలు ఉన్నాయన్నారు. సమావేశంలో షేక్ ఇస్మాయిల్, సద్దాం హుసేన్, భాస్కర్, శివుడు, మహ్మద్, రాజేష్, గణపతి, మోహన్, సామేలు, అంబయ్య తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఆత్మకూరు, జూలై 7: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. యువత ఉన్నత చదువులు చదివి ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పనపై దృష్టి సారించాలని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జబీవుల్లా, నాగరాజు, కాశీ, రాజేష్, మోహన్, లాజర్, హుసేన్, రాజేష్ గౌడ్ ఉన్నారు.

డంప్ యార్డులను పునరుద్ధరించండి

బండిఆత్మకూరు, జూలై 7: నిరుపయోగంగా మారిన డంపు యార్డులను అధికారులు తక్షణమే పునరుద్ధరించాలని సీపీఎం మండల నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు, సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం బండిఆత్మకూరులో డంప్ యార్డును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణతో సంపద తయారీ కేంద్రాలను నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. చాలా గ్రామాల్లో యార్డులు నిరుపయోగంగా మారి అసాంఘికాలకు అడ్డగా మారాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే డంప్‌యార్డులకు మరమ్మతులు చేయించి చెత్తతో సంపాదన తయారీ ప్రారంభించాలని అన్నారు. తద్వారా కొందరు పేదలకు గ్రామాల్లో జీవనోపాధి లభిస్తుందన్నారు.

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చర్చి ఫాదర్

వెలుగోడు, జూలై 7: మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో వర్షం కోసం సీఎస్‌ఐ చర్చిల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు సీఎస్‌ఐ చర్చి 1,2ల వద్ద శిలువకు నీరు పోశారు. అనంతరం భజనలు చేసుకుంటూ గ్రామ శివార్లలోని పంట పొలాలకు చేరుకున్నారు. పంట పొలాల్లో హాజరైన జనానికి ఫాదర్లు జయరాజు, ప్రేమ్‌కుమార్‌లు హితబోధ చేశారు. ప్రార్థనల అనంతరం సామూహిక వన భోజనాలు చేశారు. సకాలంలో వర్షాలు కురవాలని ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహించనట్లు సంఘం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా చర్చిల మత పెద్దలు దానమయ్య, రత్నమయ్య, స్వాములు, మద్దెల సామేలు, చంద్రశేఖర్, చెన్నయ్య, అభిషేకం తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలి

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జూలై 20న కర్నూలులో జరిగే రాష్ట్ర సర్వ సభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యలయంలో రాష్ట్ర సమావేశ కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రైతు, రైతు కూలీ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి శంకర్, మదన గోపాల్, రమణయ్య శెట్టి, చౌడప్ప పాల్గొన్నారు.


వెలుగోడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగేశులు


నందికొట్కూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

ఎస్సీ వర్గీకరణతోనే

మాదిగల అభ్యున్నతి

ఆత్మకూరు రూరల్, జూలై 7: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభ్యున్నతి సాధ్యమని, ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమించక తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలుక రాబిన్‌సన్ రాజు, జిల్లా అధికార ప్రతినిధి భాషపోగుల దరగయ్య, జిల్లా కార్యదర్శి తప్పెట నాగశేషులు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి మాదిగలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దఅనంతాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవంలో భాగంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు అనుకూలంగా ఉండటం సానుకూల అంశమని, వర్గీకరణ సాధన కోసం జాగరూకతతో అడుగులు ముందుకు వేయాలని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దేవసహాయం, ముంతన్న, నాయకులు రామారావు, వరదరాజు, బాలరాజు, చిన్న పుల్లయ్య, రంగస్వామి పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తాం

కొత్తపల్లి: ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కేవీ రమణ అన్నారు. ఆదివారం మండలంలోని నాగంపల్లిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాసపోగు దర్గయ్య, స్వామన్న, కే.దర్గయ్య, ఈ.రాజు, అడ్డాకుల ప్రసాద్, బుజ్జి, నాగశేషులు, వెంకటేశ్వర్లు, ప్రేమరాజు, రామకృష్ణ, సురేష్, ఓబులేసు, శ్రీను, నరసింహ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ సాధన కోసం పాటుపడదాం

వెలుగోడు, జూలై 7: అందరూ కలిసి కట్టుగా ఉండి రిజర్వేషన్ల కోసం పాటు పడదామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగశేషులు, జిల్లా కార్యదర్శి ఆరోగ్యం అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వెలుగోడు పట్టణంలో ఎమ్మార్పీఎస్ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ఏళ్ల తరబడి ఉద్యమాలు కొనసాగిస్తున్నామని అన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడతామ న్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మల్లికార్జునుడు, పుల్లమరాజు, వేణు, వెంకటరమణ, రవుఫ్, మల్లికార్జున పాల్గొన్నారు.


పెద్దఅనంతాపురంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


నాగంపల్లిలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసిన అనంతరం మాట్లాడుతున్న కేవీ రమణ

ఎమ్మార్పీఎస్‌ను జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నందికొట్కూరు, జూలై 7: ఎమ్మార్పీఎస్ జెండాను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పటేల్ సెంటర్‌లో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలు కలిసి టీడీపీకి పట్టం కట్టారని, ఆ నమ్మకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెడతారని అన్నారు. కార్యక్రమంలో మీనాక్షి, ఎంఈఎఫ్ సంఘం నాయకులు గాంధీ, స్వాములు, సీబీఎన్ టీమ్ తమ్మడపల్లి యోసేపు, బీసీ సంఘం నాయకుడు కురుమూర్తి, టీడపీ ఎస్సీ సెల్ నాయకులు రాజన్న, కుమార్, రాజా, నాగ సురేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

● మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


మంత్రి ఫరూక్‌ను కలిసి పూలబొకే ఇస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: లయన్స్ క్లబ్ నంద్యాల శాఖ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల లయన్స్ క్లబ్ 2024-25వ సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక బాలాజి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. రాష్ట్ర మైనారిటీ సంక్షేమం, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి డాక్టర్ జీ రవికృష్ణ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా నిజాముద్దీన్, కార్యదర్శిగా సిరిగిరి రమేష్ కోశాధికారిగా మామిళ్ల నాగ రాజులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు నూతనంగా లయన్స్ క్లబ్‌లో చేరిన సభ్యులతో లయన్స్ సీనియర్ నాయకుడు శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వైద్యుల దినోత్సవ పురస్కారాలను మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన కలెక్టర్

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలెక్టర్ రాజకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం ఆమె నంద్యాల కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన ఆమె స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంత్రి ఫరూక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇరువురు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించారు.

జగజ్జననికి పుట్టింటి సారె

నంద్యాల (కల్చరల్), జూలై 7: ప్రపంచంలోనే రెండో జగజ్జననీ ఆలయంగా ప్రసిద్ధి గాంచిన నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీరె సారే సమర్పించుకుంటారు. ఆదివారం ఆషాడ మాసం సందర్భంగా రెండో రోజు ఆదివారం జగజ్జననీ అమ్మవారికి వినుకొండ మండలం చాంట్రపాడు, మంత్రాలయం, ఆత్మకూరు, ఒంగోలు, కర్నూలు, సిమెంట్‌నగర్, డోన్, బనగానపల్లె, నంద్యాల నుంచి మహిళా భక్తులు అమ్మవారికి పుట్టింటి చీరె సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గంగా భవానికి బోనాలు

నంద్యాల (కల్చరల్), జూలై 7: నంద్యాల బైటిపేటలో వెలసిన గంగా భవాని దేవస్థానం 15వ వార్షికోత్సవ బోనాల పండుగను రజక సంఘం అధ్యక్షుడు జిల్లెల శ్రీరాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, ఎన్ఎండీ ఫయాజ్‌లు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి చిత్ర పటం నెత్తిన పెట్టుకొని నృత్యం చేస్తున్న భక్తులు, అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలను సహించం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు

నందికొట్కూరు, జూలై 7: ఎమ్మెల్యే జయసూర్యపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎంఆర్‌పీఎస్ నాయకుడు రాజు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కాకరవాడ చిన్న వెంకటస్వామి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయన మనోభావాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడడం సరైంది కాదన్నారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను ఏబీఎం పాలెం చర్చి సంఘం సభ్యులు సన్మానించారు. ఆదివారం ఏబీఎం పాలెం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల మోహన్, రాజన్న, జాన్, నిమ్మకాయల రాజు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి


సమావేశమైన బీసీ సంఘం నాయకులు

ఆత్మకూరు, జూలై 7: ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రఘురాముడు యాదవ్, శివరామకృష్ణ, రామకృష్ణ, బాలస్వామియాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆ కమిటీ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో బీసీలకు ఎనిమిది మంత్రిత్వ పదవులను కేటాయించి సీఎం చంద్రబాబు తన ప్రత్యేకతను చాటుకున్నారని అన్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. 50 ఏళ్లకు పింఛన్ పథకాన్ని త్వరగా అమలు చేయాలని, బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీసీ భవన్‌లను నిర్మించడంతోపాటు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు వీరన్న, శ్రీహరి, రమణ, పెద్దనాగన్న, శ్రీరాములు, సుంకన్న తదితరులు ఉన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: జీవో నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం నంద్యాల ములాన్‌పేటలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలని అన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలని, మాతృభాషలోనే ప్రాథమిక విద్యను కొనసాగించాలని ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలను కొనసాగించాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్, భాస్కరరెడ్డి, తిమ్మారెడ్డి, రాజ్‌కుమార్, దస్తగిరి, రామేష్‌బాబు, శైలజ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, జూలై 7: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తం గా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణం లో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

● **ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం గుంటూరుకు చెందిన సుబ్బలక్ష్మి బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పా టు చేసింది. ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, శివశివశంకరా, భో..శంభో, ఓం శివోహం, నమశ్శివాయతే, అయిగిరి నందిని తదితర గీతాలకు హేమశ్రీ, తేజ వెంకటలక్ష్మి, హిమశ్రీ, జాగృతి, అనుదీప్తి, ప్రియదర్శిని, శ్రీసౌభాగ్యవల్లి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

నిధులు విడుదల చేయాలి

నందికొట్కూరు, జూలై 7: అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలో రైతు సంఘం తాలుకా నాయకుల సమావేశం సుధాకర్ అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతులు దుక్కి దున్నడానికి ఖరీఫ్‌లో విత్తనాలు ఎరువులు వేయడానికి మొదటి విడత పెట్టుబడి సహాయం అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో గోపాల్, నాగశేషులు, తిరుపాలు, మద్దిలేటి, శ్రీనివాసులు, మౌలాలి, సుధాకర్, వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల (కల్చరల్), జూలై 7: నంద్యాల నగర సేవా సంఘం నూతన కమిటీని ఆదివారం నాగులకట్ట ఆలయంలో ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, న్యాయ సలహాదా రుడిగా చంద్రశేఖర్, వైద్య విభాగ కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సురేష్‌కుమార్, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు

గడివేముల, జూలై 7: మండలంలోని బిలకలగూ డూరు గ్రామంలో 11వ షాపులో రేషన్ పంపిణీపై అవకతవకలు జరుగుతున్నాయని మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాల్సి ఉండగా రేషన్ దుకాణం వద్ద డీలర్ లేకుండానే తక్కెడపై రాళ్లు పెట్టి రేషన్ పంపిణీ చేయకుండా స్లిప్‌లు ఇస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో బియ్యం పంపిణీ చేయకుండా లబ్ధిదారులకు డబ్బులు ఇచ్చి రేషన్ దందాను కొనసా గించారని, ప్రభుత్వం మారిన ఎండీయూ ఆపరేటర్ల తీరు మారలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బిలకలగూడూరులో రేషన్ దుకాణం వద్ద స్లిప్‌లు ఇస్తున్న ఎండీయూ ఆపరేటర్

ధ్రువపత్రాల పరిశీలన

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేసే కాంట్రాక్ట్ అధ్యాపకుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన, అంగీకా ర పత్రాన్ని సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆర్జేడీ ఆదేశాల మేరకు ప్రక్రియ కొనసాగుతుందని జూలై 8వ తేదీ లోపు తమ అంగీకా రాన్ని ప్రిన్సిపాల్‌కు తెలియజేయవలసి ఉంటుందని ఆమె సూచించారు. సమర్పించిన అధ్యాపకులను మాత్రమే రెన్యువల్‌కు అనుమతిస్తూ ఈ విద్యా సంవ త్సరానికి కౌన్సెలింగ్ ద్వారా కళాశాలలు కేటాయిస్తారని ఆమె తెలిపారు.

వ్యక్తికి గాయాలు

మహానంది, జూలై 7: మహానంది మండలం గోపవరం గ్రామ మెట్ట వద్ద రెండు మోటార్ బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఆదివారం శిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన లక్ష్మయ్య బైక్‌పై వెళ్తుండగా గోపవరం మెట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో మోటర్ బైక్ ఢీకొంది. ఈప్రమాదంలో గాయపడిన లక్ష్మయ్యను స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందిస్తున్న మూలే రామేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 7: మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామానికి బాధిత కుటుంబానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ. 25వేలు ఆర్థిక సాయం చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బొరుగుల చం ద్రుడు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా విషయం తెలుసుకున్న మంత్రి బీసీ వెంటనే స్పందించి ఆదుకున్నట్లు ఆయన తెలిపారు. బాధితుడికి బీసీ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పుల్లయ్య, సురేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య

బేతంచెర్ల, జూలై 7: ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించి, పనిభారం తగ్గించాలని 10న చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆశా వర్కర్ల యూనియన్ సర్వసభ్య సమావేశం సీఐటీయూ కార్యాలయంలో పట్టణ అధ్యక్షురాలు లావణ్య అధ్యక్షత నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని అన్నారు. ఇతర సౌకర్యాలు గుర్తించి 62 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు పని చేయించుకుని ఆశా వర్కర్లకు ప్రభుత్వ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండానే తొలగించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సంధ్యారాణి, నాగేశ్వరి, రామేశ్వరి, రామలక్ష్మి, రమణమ్మ, సరోజమ్మ, రాజమ్మ, ముని, ఉమామహేశ్వరి, లక్ష్మీదేవి, రాధమ్మ, మంజుల, విజయ, చిత్ర కుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో వర్ధంతి భోజనమా..?

రుద్రవరం, జూలై 7 : హిందూ ఆగమ శాస్త్రం ప్రకారం దేవాలయాల్లో వర్ధంతి భోజనం పెట్టరాదు. అన్నదానం మాత్రమే చేయాలి. వర్ధంతి భోజనాలు ఏర్పాటు చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. రుద్రవరం మండలం వాసాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రథమ వర్ధంతి అంటూ కుటుంబ సభ్యులు భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. పైగా దేవాలయ ఆవరణలో ప్రథమ వర్ధంతి అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం చూసి భక్తులు అవాక్కయ్యారు. వర్ధంతి భోజనం కావడంతో భక్తులు తినకుండా స్వామి అమ్మవారిని దర్శించుకుని వెనుదిరిగారు. ఈ విషయంపై దేవదాయశాఖ ఇన్‌స్పెక్టరు హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయాల్లో వర్ధంతి భోజనాలు పెట్టరాదని, ఫ్లెక్సీలు అసలు ఏర్పాటు చేయకూడదని అన్నారు.

పుట్టాలమ్మకు పూజలు

ఆళ్లగడ్డ, జూలై 7: ఆళ్లగడ్డ మండలంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి కానుకలు సమర్పించుకున్నారు. వేదపండితులు భక్తులకు అన్నదానం చేశారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం: మండలంలోని ముత్తులూరు గ్రామ సమీపంలో కొలువు దీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు లింగమయ్యకు నైవేద్యం సమర్పించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండమాయపల్లె, యల్లావత్తుల, రుద్రవరం, చిన్నకంబలూరు, ఇంకా పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలను పూజిస్తే పాడిపంటలు చల్లగా ఉంటాయని మహిళా భక్తులు నమ్మకం వ్యక్తం చేశారు.

వ్యక్తిపై హత్యాయత్నం

డోన్(రూరల్), జూలై 7: డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు పొలంగట్టు విషయంలో వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన మారిబోయిని మాదయ్య (45) అనే వ్యక్తిపై ప్రత్యర్థి వేటుకొడవళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పట్టణ ఎస్ఐ తెలిపారు. గాయపడిన మాదయ్యను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాకాంబరి అలంకారంలో గంగమ్మ

చాగలమర్రి, జూలై 7: చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం ఆషాడమాసం సందర్భంగా గంగమ్మ శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహికంగా పండ్లు, కూరగాయలు, పుష్పాలతో గంగమ్మను అలంకరింప చేశారు. పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి దశ హారతులు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితమైన సచివాలయ భవనాలు

● మూడేళ్లయినా పూర్తికాని వైనం



జలదుర్గంలో పునాదులకే పరిమితమైన సచివాలయ భవనం

ప్యాపిలి, జూలై 7: గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయ భవనాలు పునాదులకే పరితమయ్యాయి. పనులు ప్రారంభించి మూడేళ్లయిన భవనాలు పూర్తికాకపోవడంపై వైసీపీ ప్రభుత్వం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలానికి 23 సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి అప్పటి ప్రభుత్వం రూ.32లక్షల నిధులు మంజూరు చేసింది. మొదటి విడతలో 12 సచివాలయాలు భవనాలు పూర్తి చేసినప్పటికీ రెండు విడతలో ప్రారంభించిన 11భవనాలు వివిధ దశల్లో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జక్కసానికుంట్ల, పెద్దపూదిళ్ల, మునిమడుగు, జలదుర్గం గ్రామాల్లోని సచివాలయ భవనాల్లో కొన్ని టాప్ లెవెల్ వరకు పూర్తి కాగా మరి కొన్ని పూనాదులకే పరిమితయ్యాయి. దీంతో సచివాలయాలను ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన సౌఖర్యాలు లేక సచివాలయ ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రమాదకరంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

భయాందోళనలో ప్రజలు



చాగలమర్రి, జూలై 7: చాగలమర్రిలో 33 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఓవర్‌హెడ్ ట్యాంకు శిధిలావస్థకు చేరింది. పెద్దమకానం వీధిలో పాలకులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకు ఏర్పాటు చేయించారు. ఈ ట్యాంకు ద్వారానే గ్రామంలో మంచి కొళాయిల ద్వారా సరఫరా అయ్యేది. ట్యాంకు దెబ్బతినడంతో ఎనిమిదేళ్లుగా వినియోగించడం లేదు. ట్యాంకు అడుగు భాగం నుంచి పెచ్చులూడిపడుతున్నాయి. స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకును కూల్చివేసి ప్రమాదం జరుగకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. కూల్చివేతకు ఉన్నతాధికారుల అనుమతి కోసం ప్రతిపాదన చేశామని, ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య పేర్కొన్నారు.

తాగునీటి కష్టాలు



డి.కొత్తపల్లెలో పొలం వద్ద బోరు నీటిని పట్టుకుంటున్న ప్రజలు

చాగలమర్రి, జూలై 7: మండలంలోని డి.కొత్తపల్లె ఎస్సీ కాలనీవాసులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. నెల రోజుల నుంచి కొళాయిలకు నీరు రాకపోవడంతో మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమీపంలోని పొలాల బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. కాలనీలోని 120 కుటుంబాలకు కొళాయిల ద్వారా నీటి సరఫరా జరగడం లేదని, పలుమార్లు పాలకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఖరీఫ్‌కు వరి నారుమళ్లు సిద్ధం



చిన్నకంబలూరు సమీపంలో సాగు చేసిన వరి నారుమడి

రుద్రవరం, జూలై 7 : రుద్రవరం మండలంలో వ్యవసాయ బోరుబావుల కింద ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేసుకునేందుకు నారుమళ్లు రైతులు సిద్ధం చేశారు. మండలంలోని చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, కొండమాయపల్లె, దక్షిణకొట్టాల, రుద్రవరం, ఆలమూరు ఇంకా పలు గ్రామాల్లో సుమారు 15 నుంచి 20 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

సమాజసేవే లక్ష్యం : రోటరీ క్లబ్



నూతన కార్యవర్గ సభ్యులు

బేతంచెర్ల, జూలై 7: సమాజసేవయే బేతంచెర్ల రోటరీ క్లబ్ ధ్యేయమని రోటరీ గవర్నర్లు శ్రీరామమూర్తి, కేశవరెడ్డి, దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణ శివార్లలోని నంద్యాల రహదారిలో ఉన్న రోటరీక్లబ్ కమ్యూనిటీ హాలులో 2024-25 ఏడాదికి గానూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అశ్వర్థన ఆరాయణ, జాయింట్ కార్యదర్శిగా రాజేష్, కోశా ధికారిగా సత్తార్ హాజీ కార్యవర్గ సభ్యులుగా లోకేశ్ గుప్తా, అమ ర్నాథ్, ప్రేమ్ స్వరూప్, కలీం, సునీల్ కుమార్, అహ్మద్ హుశేన్, ఫయా జ్, అబ్దుల్ సత్తార్, మహమ్మద్ ఆజాం, ఖాజామొద్దిన్, శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా గోపాల్, విజయ నాగరాజు, మద్దిలేటి స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

రూ.వందకు చేరువలో పచ్చి మిర్చి

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు



సంజామల, జూలై 7: కూరగాయల ధరలు మండిపోతున్నాయి కిలో పచ్చి మిర్చి వందరూపాయలకు చేరువైంది. పెరిగిన కూరగాయల ధరలతో సామాన్య మధ్య తరగతి కుటుంబాల్లోని వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంజామలలో ఆదివారం వారపు సంతలో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. కిలో పచ్చి మిరప రూ. 90, కిలో బీర రూ.80, కాకర రూ.80, క్యారెట్ రూ.80, బీన్స్ రూ. 80 ధరలు పలికాయి.

రక్తదానం చేయండి



రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న పట్టణ ఎస్ఐ నగీనా

ఆళ్లగడ్డ, జూలై 7: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పట్టణ ఎస్ఐలు వెంకటరెడ్డి, నగినా కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రక్తదాతల టీం అధ్యక్షుడు మహమ్మదుహుసేన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు సుబ్బారెడ్డి, పరమేష్, బాబు, అబ్దుల్ జీలాని, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చాగలమర్రిలో మోస్తరు వర్షం



చాగలమర్రిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

చాగలమర్రి, జూలై 7: చాగలమర్రిలో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో సేయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలోగల రహదారిపై వర్షపు నీటితో కలిసి మురుగు నీరు ప్రవహించింది. చెత్తాచెదారం రహదారిపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు నీరు రహదారిలో ప్రవహించి దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరు రహదారిపై ప్రవహించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

యాగంటిలో భక్తుల సందడి



వెంకటేశ్వరగుడి వద్ద భక్తుల సందడి

బనగానపల్లె, జూలై 7: మండలంలోని యాగంటి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి ఉమామహేశ్వరస్వామి వారిని దర్శించుకొని, పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వరగవి, శంకరగవి, అగస్త్యముని గుహలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

అటవీ బీట్ అధికారిపై దాడి

చాగలమర్రి, జూలై 7: మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో అక్రమంగా నరసింహుడు అనే వ్యక్తి వెదురులు తరలిస్తున్నాడు.ఈ క్రమంలో అడ్డుకున్న అటవీ బీట్ అధికారిమదన్‌గోపాల్ అడ్డుకోవడంతో నరసింహుడు రాయితో దాడి చేసి గాయపరిచాడని ఎస్ఐ రమణయ్య ఆదివారం రాత్రి తెలిపారు. అక్రమంగా వెదురులు తరలిస్తున్నారని బీట్ అధికారి మదన్ గోపాల్ నరసింహుడునుఅడ్డుకున్నాడన్న ఉద్దేశంతోనే ఈ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ విషయంపై నరసింహుడు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

మంత్రి సమావేశానికి తరలివెళ్లిన నాయకులు



మంత్రిని కలిసేందుకు వచ్చిన నాయకులు

సంజామల, జూలై 7: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం కోవెలకుంట్లకు వచ్చారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సంజామల మండలానికి సంబంధించిన అభివృద్ధి పనులపై నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ప్రతి గ్రామ నాయకులు పాల్గొన్నారు. సంజామల టీడీపీ నాయకుడు పెండేకంటి కిరణ్ కుమార్ , కాణాల కేశవ రెడ్డి, రామిరెడ్డిపల్లె తులసి రెడ్డి, తోట శ్రీనివాస రెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షులు మల్కి హుసేన్, ముదిగేడు మోహన్ రెడ్డి, మహమ్మద్, ఎగ్గోని వెంకటేశ్వర రెడ్డి, మూసాని చంద్రశేఖర్ రెడ్డి, పెరుగు శ్రీనివాసులు, లింగందిన్నె పరమేశ్వర రెడ్డి, బండి ప్రతాప్ రెడ్డి, భాస్కర్, జెమిని బాష తదితరులు తరలివెళ్లారు. గ్రామాల్లో ఏఏ సమస్యలు ఉన్నాయో తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



నిందితులను అరెస్టు చూపిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్

డోన్(రూరల్), జూలై 7: పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మట్కా, నాటుసారా నిర్వాహకుల అరెస్టు వివరాలను సీఐ వెల్లడించారు. పట్టణంలో దాడులు నిర్వహించగా.. కొండపేటకు చెందిన బలిజ వెంకటేశ్, బోయ బాలు, కొత్తపేటకు చెందిన చంద్రకళ, ఇంద్రానగర్‌కు చెందిన యశోదమ్మ, చిగురుమానుపేటకు చెందిన చంద్రకాంత్, కొండపేటకు చెందిన ఈడిగ నాగరాజు మట్కా రాస్తూ, మరోవైపు నాటుసారాను విక్రయిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 60 లీటర్ల నాటుసారాను రూ.65వేల నగదును స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కొలిమిగుండ్ల, జూలై 7: ముస్లిం, మైనార్టీ కొలిమిగుండ్ల గ్రామ కమిటీని ఆదివారం కొలిమిగుండ్లలోని మసీదులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, బుడెన్‌సాహెబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా హుస్సేన్‌భాషా, ఉపాధ్యక్షుడిగా బాబాఫక్రుద్దీన్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, పలువురు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఖాజీ ఖాదర్‌వలి, రిటైర్డ్ లైబ్రేరియన్ మహబూబ్‌ఖాన్, బాబు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో విశేష పూజలు ..

కొలిమిగుండ్ల, జూలై 7: మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పెద్దమ్మతల్లిని దర్శించుకొని బోనాలు నైవేద్యంగా సమర్పించారు. కొలిమిగుండ్లలో వెలసిన చౌడేశ్వరి మాతకు భక్తులు పెద్ద ఎత్తున విశేష పూజలు నిర్వహించారు.

రూ.1.5 లక్షల వంట పాత్రలు వితరణ



చాగలమర్రిలో వంట పాత్రలు అందజేస్తున్న దాత, టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి

చాగలమర్రి, జూలై 7: చాగలమర్రిలోని పాత శివాలయంలో రూ.1.5 లక్షల విలువ చేసే వంట పాత్రల సామగ్రిని టీడీపీ నాయకుడు వి.భాస్కర్‌రెడ్డి దేవాలయానికి విరాళంగా ఆదివారం అందజేశారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకరసుబ్బారావు, గుత్తి నరసింహులు, రమేష్, మధు, బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, ఓబులేసు, ప్రశాంత్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్ వాహనం ప్రారంభం



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంబులెన్స్ వాహనం ప్రారంభిస్తున్న శ్రీరామ్మూర్తి

బేతంచెర్ల, జూలై 7: సమాజంలోని ప్రజలు ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంబులెన్స్ వాహనాన్ని శ్రీరామ్మూర్తి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజసేవయే పరమార్థంగా రోటరీ క్లబ్ సమాజసేవ చేయడం హర్షణీయమన్నారు. ప్రమాదాల్లో గాయపడి ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయడం సమాజసేవకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం



కొలిమిగుండ్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

ఆళ్లగడ్డ, జూలై 7: సమాజంలో అట్టడగు వర్గాల కోసం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యంతో స్థాపించిన ఎమ్మార్పీఎస్‌కు 30 ఏళ్లు గడచిపోయాయని ఆళ్లగడ్డ తాలుకా ఎమ్మార్పీఎస్ నాయకులు కేపీ ఓబులేసు, కోర్టు బ్రహ్మం అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో జెండాను ఎగుర వేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సమాజంలోని అణగారిన కులాల్లో చైతన్యం కల్పించడమే కాకుండా సమాజంలోని వికలాంగులకు, డప్పు కళాకారులకు పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి విజయం సాధించారన్నారు. పింఛన్ల పెంపునకు అంగీకరించిన సీఎం చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తాలుకాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చాగలమర్రి: చాగలమర్రిలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా నాయకుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గాంధీ సెంటర్‌లో జెండాను ఆవిష్కరించి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని కూటమి నాయకులు మాట ఇవ్వడంతో ఆ పార్టీ విజయానికి కృషి చేశామని అన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణపై దృష్టి ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ తాలుకా కార్యదర్శి మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ నాయకులు రంగరాజు, సంజీవరాయుడు, లక్ష్మీనారాయణ, బుజ్జి, ప్రకాష్, రాజు, బాల ఓబన్న, రాజేష్ పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో ఎమ్మార్పీఎస్ 30 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఆవుల మహేశ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శివనారాయణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులకు ఎదుర్కొని ఎన్నో సాధించిన ఘనత మందకృష్ణమాదిగది అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మద్దిలేటి, గుండన్న, శ్రీను, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని కొండపేటతో పాటు మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గూండాల ఈశ్వరయ్య మాదిగ, నాయకులు పులికేశవయ్య, చిన్నరాయుడు మాదిగ, కోసానిపల్లి రామాంజనేయులు మాదిగ, పులి పెద్దయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సంజీవ్, ఎంఎస్ఎస్ మండల అధ్యక్షుడు జి.జయప్రకాష్ మాదిగ, నూతన ప్రసాద్, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ఎమ్మార్పీస్ అంతిమ లక్ష్యం ఎస్సీ వర్గీకరణ సాధించడమేనని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గారి దస్తగిరిమాదిగ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మార్పీస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధికారి ప్రతినిధి మంద విజయ్‌కుమార్, నాగాంజనేయ, కొండా రామచంద్ర, దాసరి అంజనేయులు, కచ్చా దస్తగిరి, నారాయణ, వెంకటరాముడు, వెంకరామయ్య, కనకాద్రిపల్లె చిన్నపుల్లయ్య, బెలుం రమేష్, వెంకటరాముడు, మాలిక్‌భాషా పాల్గొన్నారు.

● స్థానిక ఎస్సీ కాలనీలోని దండోరా కమ్యూనిటీ కార్యాలయంలో జిల్లా ఎమ్మార్పీస్ నాయకులు ఇరికమాను నాగేశ్వరరావు ఆధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీస్ జెండాను ఆవిష్కరించి, వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మారెన్న, చిన్నపక్కీర, దస్తగిరి, రామచంద్రుడు, ఆదినారాయణ, శీను, సుబ్బరాయుడు, బాలోబులేషు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ పట్టణంలోని నాల్గు రోడ్ల కూడలిలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ



బనగానపల్లెలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



చాగలమర్రిలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకుడు వేణుగోపాల్